ప్రమాదపుటంచుల్లో ప్రయాణం

ప్రైవేట్ వాహనాల ఇష్టారాజ్యం | పట్టించుకోని అధికారులు

మొగుళ్లపల్లి: గ్రామాల్లో ప్రజలు ఎక్కువగా ప్రైవేట్ వాహనాలపై ఆధారపడి ప్రయాణం సాగిస్తుంటారు. కాగా, ప్రైవేట్ వాహనాలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో పరిమితికి మించి ప్రయాణికులతో నడుపడం వల్ల ప్రయాణికుల ప్రాణాలు గాల్లో దీపాల్లాగా మారుతున్నాయి. వాహనదారులు వాహనాలకు ఉండే పేపర్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తదితర అంశాలు కలిగి ఉండాలనే నింబంధనలు పాటించడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్ర నష్టాలను చవి చూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

వాహన చట్టానికి తూట్లు

పట్టణాల్లో, గ్రామాల్లో వాహనాలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిన వాహనాలను నడుపడం వల్ల ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎక్కువగా డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు ఆటో, జీప్, టాటామ్యాజిక్, టాటాఏస్ వంటి వాహనాలను నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. జీప్‌లో సీట్ కెపాసిటీ ఏడుగురు, చిన్న ఆటోలో నలుగురు, పెద్ద ఆటోలో ఏడుగురు, టాటా మ్యాజిక్‌లో ఏడుగురు ప్రయాణికులు ప్రయాణించాల్సి ఉంటుంది. కాని అందుకు


ట్రాలీలో అధిక సంఖ్యలో వెళ్తున్న కూలీలు(ఫైల్)

విరుద్ధంగా 20 మందికి తగ్గకుండా ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలను నడుతున్నారు. వ్యవసాయానికి వాడాల్సిన ట్రాక్టర్లను సైతం పంట పొలాల్లో పని చేసే దినసరి కూలీలను తరలించేందుకు వినియోగించడంతో ప్రమాదవశాత్తు పడిపోయిన సంఘటనలు చాలానే ఉన్నాయి. ఇలా ప్రతీ సంవత్సరం ఆటో, జీపులతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు పాటించాలి



గ్రామాల్లో తిరిగే ఆటోలు, జీపులు, టాటామ్యాజిక్ డ్రైవర్లు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. ఓవర్‌స్పీడ్, ఓవర్‌లోడ్‌లతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటాం. ప్రతీ డ్రైవర్ తప్పనిసరిగా లైసెన్స్‌ను కలిగి ఉండాలి. వాహనాల పేపర్లు కలిగి లేని చట్టం ప్రకారం సీజ్ చేస్తాం.

– అశోక్, ఎస్సై, మొగుళ్లపల్లి

కాలం చెల్లిన వాహనాలతో ముప్పు..

గ్రామాల్లో ఎక్కువగా కాలం చెల్లిన వాహనాలనే తక్కువ ధరకు తీసుకొచ్చి వాడడం వల్ల వాతావరణంపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాలం చెల్లిన వాహనాలలో ఎక్కువగా కార్బన్ మోనాక్సైడ్ విడుదల కావడం వల్ల వాతావరణాన్ని కలుషితమై మానవాళిపై ఎక్కువగా ప్రభావం చూపేడుతోంది. ఆర్టీఏ, పోలీస్ అధికారులు నామమాత్రపు తనిఖీలతో పట్టించుకోకపోవడం వల్ల వాహనాల వినియోగం విచ్చల విడిగా కొనసాగుతుంది. అధికారులు వాహన చట్టాన్ని విధిగా అమలు చేస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కష్టపడే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ: పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం రేగొండ, కొత్తపల్లిగోరి మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణ, నిబద్ధత, సమన్వయంతో పని చేసే నాయకులకు పదవులు వరిస్తాయన్నారు. ప్రతీ కార్యకర్త ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యవంతం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత, కొత్త నాయకులు సమన్వయం చేసుకుంటూ మెజారిటీ స్థానాలు గెలుపొందాలన్నారు. అంతకుముందు కొడవటంచ లక్ష్మీనరసింహాస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో జరుగుతున్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్లు గూటోజు కిష్టయ్య, గుమ్మడి శ్రీదేవి, రాష్ట్ర నాయకులు నాయిని సంపత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, కోటంచ ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, జిల్లా, మండల నాయకులు పున్నం రవి, సూదనబోయిన ఓంప్రకాశ్, భలేరావు మనోహర్‌రావు, వీరబ్రహ్మం, మేకల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

గోవిందరావుపేట: మండలంలోని పస్రాలో ఉన్న 132 కేవీ ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో కోతి హై వోల్టేజీ లైన్లకి తగలడంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో కర్లపల్లి ఫీడర్‌కు విద్యుత్ నిలిచిపోయింది. వెంటనే డీఈఈ పుల్సం నాగేశ్వరరావు, ఏడీఈ వేణుగోపాల్ పర్యవేక్షణలో సిబ్బంది అప్రమత్తమై విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన కోతి విద్యుదాఘాతానికి విగతజీవిగా మిగిలిపోయింది. విద్యుత్ పునరుద్ధరణ పనిలో లైన్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్, లైన్‌మన్ వేణు, ఏఎల్‌ఎంలు భిక్షపతి, రాజేష్, సోమిరెడ్డి, సురేష్, యాకుబ్, రాజేందర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరువుల షాపు ఎదుట రైతు నిరసన

మల్హర్: గడ్డి మందు కారణంగా తన పంట చనిపోయిందని మండలంలోని తాడిచర్లలోని ఓ ఎరువుల షాపు ఎదుట మంగళవారం సాయంత్రం ఓ రైతు దంపతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ.. ఇరువై రోజుల క్రితం షాపు యజమాని ఇచ్చిన గడ్డి మందు కారణంగా తన పొలం అంత ఎండిపోయిందని తెలిపారు. కాగా, నష్ట పరిహారం విషయంపై పెద్ద మనుషుల సమక్షంలో వారం రోజుల్లో డబ్బులు ఇవ్వడానికి షాపు యజమాని ఒప్పుకున్నట్లు రైతు చెప్పారు. ఇచ్చిన గడువు దాటిన పట్టించుకోక పోవడంతో చేసేది లేక నిరసన చేపట్టినట్లు వెల్లడించా రు. కాగా, రైతుకు షాపు నిర్వాహకుడు పంట నష్ట పరిహారం ఇవ్వడంతో సమస్య సద్దుమనిగింది.

కమిటీ ఎన్నిక

చిట్యాల: చిట్యాల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మండల కేంద్రంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్కూరి మొగిలి, ఉపాధ్యక్షుడిగా చింతల మహేందర్, ప్రధాన కార్యదర్శిగా గజనాల మహేందర్, సహాయ కార్యదర్శిగా సామల ధనుంజయ, కోశాధికారిగా బుర్ర చక్రపాణి, కార్యవర్గ సభ్యులుగా గుర్రం చందు, ఆకుల హరీశ్, చింతకింది శ్రీనివాస్, కోడెల సదానందం, గుర్రం శంకర్ ఎన్నికయ్యాయరు.

మహిళను ఢీకొన్న లారీ

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద మంగళవారం వాజేడుకు చెందిన పూనెం మధనమ్మను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధనమ్మ కాలుకు గాయం కావడంతో ఆమెను 108లో ఏటూరునాగారం అక్కడి నుంచి ములుగుకు తరలించారు.

విద్యుత్ త్రీఫేజ్ లైన్ పనులు



వాజేడు: మండల కేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన త్రీఫేజ్ లైన్ పనులు శర వేగంగా సాగుతున్నాయి. మండల కేంద్రంలోని జంగాలపల్లి, నాగారం, వాజేడులో ఈ పనులను చేపట్టి ఎత్తైన స్తంభాలను ఏర్పాటు చేయడంతో పాటు వైర్లను లాగుతున్నారు. మండల కేంద్రంలో వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 60 కేవీ, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు.

పైపులైన్‌కు మరమ్మతు



వాజేడు: మండల పరిధిలోని జంగాలపల్లిలో మంగళవారం మిషన్ భగీరథ పైపు లైన్‌కు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామంలో త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ పనులు కోసం పైపు లైన్‌పై స్తంభం వేశారు. కాగా, ట్యాంకు నుంచి నీటిని గ్రామంలోకి సరఫరా చేసే పైపు లైన్ కావడంతో గ్రామంలో తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో సిబ్బంది పైపు లైన్‌ను వేరే దిశలో మార్చి మరమ్మతులు చేసి తాగు నీటిని అందించారు.

ఆర్థికసాయం

మంగపేట: మండలంలోని కమలాపురం ఒడిషా కా లనీకి చెందిన ప్రతాప్ ఇల్లు మంగళవారం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో బాధిత కుటుంబానికి తక్షణ సాయం కింద కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు 25 కేజీల బియ్యం, రూ.3500 అందజేశారు. పున్నారావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు సురేశ్, శ్యాంబాబు, సాంబిరెడ్డి, నిమ్మల రాంబాబు, మహిమూద్, తోట అశోక్, రంజిత్, శ్రీనాథ్, సమ్మయ్య, చలపతిరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ దురుసు ప్రవర్తన

ములుగు రూరల్: అంగన్‌వాడీ చిన్నారి తల్లిపై టీచర్ దురుసుగా ప్రవర్తించిన సంఘటన జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో చోటు చేసుకుంది. బాధితురాలు కోరె కావ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుబాష్‌నగర్ కాలనీ ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి తన కుమార్తెను మంగళవారం పంపించినట్లు తెలిపారు. తొలి రోజు పాఠశాలకు పంపించామని తన కూతురు సమాచారం కోసం మధ్యాహ్నం సమయంలో క్షేమ సమాచారం కోసం ఫోన్ చేయగా దురుసుగా ప్రవర్తించారని అన్నారు. ఈ విషయంపై కేంద్రానికి వెళ్లి అలా ఎందుకు మాట్లాడావు అని అడిగిన ఆమె ప్రవర్తనలో మార్పు లేకుండా ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకో అని మాట్లాడారని ఆవేదన చెందారు. ఈ విషయంపై సీడీపీఓ, డీడబ్ల్యూఓకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి అంగన్‌వాడీ టీచర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

సాగునీటి కష్టాలకు బీఆర్‌ఎస్సే కారణం

● కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్

టేకుమట్ల: యాసంగి రైతులకు నీటికష్టాలు రావడానికి ఇసుక క్వారీలకు అనుమతులిచ్చిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు పునరాలోచించాలన్నారు. ఇంటి నిర్మానాలకు మాత్రమే ఇసుకను తరలిస్తే ఇసుక అక్రమ రవాణా అంటూ మోసపూరిత వ్యాఖ్యలు సరైనవి కాదన్నారు. ఈ కార్యక్రమంలో


మాట్లాడుతున్న కోటగిరి సతీశ్‌గౌడ్

సంగి రవి, నాంపెల్లి వీరేశం, బొల్లికొండ రాజయ్య, శ్రీకాంత్‌పాణి, వైనాల రవిందర్, క్రాంతి, అల్లం ఓదెలు, రమేశ్, శాస్త్రాల కిరణ్, అనిల్, దాసారపు సతీశ్, వంగ నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


చిట్యాల: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న వాల్యానాయక్


రేగొండ: వంటలను పరిశీలిస్తున్న సునీల్ కుమార్


కాటారం: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న నరేశ్

● మండల ప్రత్యేకాధికారి వాల్యానాయక్

చిట్యాల: విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డీసీఓ, మండల ప్రత్యేకాధికారి మాలోత్ వాల్యా నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల, మోడల్ స్కూల్ హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టళ్లలో ఉన్న వంట గది, డైనింగ్ హాల్, స్టోర్‌రూం, టాయిలెట్స్, అటెండెంట్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉంటుందని, మెనూ ప్రకారం పెడుతున్నారా అడిగి తెలుసుకున్నారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం హాస్టల్‌లో ఉన్న పలు సమస్యలను డీసీఓ దృష్టికి ప్రిన్సిపాల్ తీసుకెళ్లారు. ఇక్కడి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జయశ్రీ, ప్రిన్సిపాల్ సుమలత, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

గురుకుల పాఠశాలల తనిఖీ

రేగొండ: మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే బాలుర, లింగాలలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి సునీల్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వండిన భోజనాన్ని, వంటగది, స్టోర్ రూమ్‌లోని సరుకులను పరిశీలించారు. అనంతరం వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, విజయ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కాటారం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఓ నరేశ్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. కళాశాల ఆవరణలో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, కిచెన్, వంట సామాన్లు, టాయిలెట్స్, రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి, టీపీ మనోజ్, కార్యదర్శి షగీర్‌ఖాన్ ఉన్నారు.

బ్రాండెడ్ మద్యం అమ్మడం లేదని ఫిర్యాదు

కాటారం: కాటారం సబ్ డివిజన్ పరిధిలోని వైన్ షాపులలో బ్రాండెడ్ మద్యం అమ్మడం లేదని ఆరోపిస్తూ మండలకేంద్రానికి చెందిన రామిళ్ల రాజబాబు మంగళవారం హైదరాబాద్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. కాటారం, మహదేవపూర్, మహాముత్తారం, మల్హర్, పలిమెల మండలాల్లో ఏర్పాటుచేసిన వైన్‌షాపుల్లో పలు కంపెనీలకు చెందిన బ్రాండెడ్ బీర్లు, మద్యం లభించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బెల్టు దుకాణాల్లో సామాన్యులు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని విన్నవించారు. పలు మార్లు ఎక్సైజ్ అధికారులు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రాజబాబు ఆరోపించారు. చర్యలు తీసుకోవాలని డైరెక్టర్‌ను కోరినట్లు రాజబాబు తెలిపారు.

అధికారుల సూచనలు పాటించాలి

● ఏఓ ముంజ మహేశ్

వాజేడు: రైతులు పంటలకు ఎరువుల వాడకంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఓ ముంజ మహేశ్ అన్నారు. మండల పరిధిలోని అరుణాచలపురం, టేకులగూడెం గ్రామాల్లో మంగళవారం భూసార పరీక్షల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్షల ఆధారంగా రైతులు పంటలు సాగు చేయడంతో పాటు ఎరువులను వాడాలన్నారు. ఎరువులను ఎక్కువ మొత్తంలో వాడితే భూమి పొరల్లో పంటకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు చనిపోయి భూసారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ హరీష్, జాఫర్ ఉన్నారు.


మాట్లాడుతున్న మహేశ్

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 81 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే నూగూరు, ఆలుబాక, మరికాల, రాచపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జ్యోతి, ఆశీష్, వినయ్, మనోహర్ సిబ్బంది యాకమ్మ, రామలక్ష్మి, తదితరులు ఉన్నారు.

హెల్త్ సెంటర్‌లోని సమస్యలు పరిష్కరించాలి

● బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని సమస్యలు పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడికల శివ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను బీఎస్పీ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్ సెంటర్‌లో 100 పడకల సౌకర్యం కల్పించాలన్నారు. అవసరమైన వైద్య సిబ్బందిని, పరికరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు కొండ చరణ్, కుమ్మరి రాంబాబు, గణేష్ చారి, సతీష్, వెంకటేష్, నారాయణ మూర్తి సంజయ్‌తో పాటు తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

జయప్రదం చేయాలి

మొగుళ్లపల్లి: హైదరాబాద్‌లో ఈనెల 20న నిర్వహించే విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టీవీఏసీ జేఏసీ జిల్లా చైర్మన్ తిప్పరపు రాజు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సెక్షన్ ఆఫీస్‌లో నిర్వహించిన ఆర్టిజన్ చైతన్య సదస్సులో అయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులోకి కన్వర్షన్ చేయాలన్నారు. ప్రభుత్వం వచ్చి 14 నెలలు దాటిన కార్మికుల సమస్యలు తీర్చలేదన్నారు. కోటి, నవీన్, దేవేందర్ రెడ్డి, బాబురావు, భిక్షపతి, మహేందర్‌రెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాజేడు: వాజేడు, వెంకటాపురం(కె) మండలాలకు విద్యుత్ సరఫరాలో నేడు(బుధవారం) అంతరాయం కలుగుతుందని ములుగు డీఈ పులుసుం నాగేశ్వరావు, వెంకతాపురం(కె) ఏడీఈ అకిటి స్వామి రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వెంకటాపురం(కె)లోని 132/33 కేవీఎస్ఎస్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం


కరపత్రాలు అందజేస్తున్న సుందర్‌రాజ్ యాదవ్

భూపాలపల్లి అర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా స్వతంత్ర అభ్యర్థి సుందర్‌రాజ్‌యాదవ్ జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు అందజేశారు. కళాశాల కరస్పాండెంట్ గుర్రపు రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సన్మానం

టేకుమట్ల: వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌యాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికా విద్యాలయానికి వచ్చారు. దీంతో మండల బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, చిట్యాల మాజీ జెడ్పీటీసీ గొర్రె సాగర్, మాజీ వైస్ ఎంపీపీ పోతనవేని ఐలయ్య, మాజీ సర్పంచ్‌లు ఉద్దమారి మహేశ్‌యాదవ్, బిల్లకంటి ఉమేందర్ రావు, మాజీ ఎంపీటీసీ ఆది రఘు పాల్గొన్నారు.

బీమాతో కుటుంబాలకు ధీమా

ములుగు రూరల్: ప్రమాద బీమాతో కుటుంబాలకు ధీమా ఉంటుందని తపాలా శాఖ ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్ ప్రమోద్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవగిరిపట్నం గ్రామానికి చెందిన తేజావత్ ద్వాలి కుమారుడు ఇటీవల ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందగా తపాలా బీమా చెక్కు రూ.10లక్షలను అందజేశారు. తపాలా శాఖ ప్రమాద బీమా రూ.520 చెల్లించారని తెలిపారు. సబ్ డివిజన్ హెడ్ దయానంద్, పంచాయతీ కార్యదర్శి నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

సేవాలాల్ జయంతి వేడుకలు


సేవాలాల్ జయంతి వేడుకల్లో నాయకులు

ములుగు రూరల్: సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను మండలంలోని పత్తిపల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూజారి బాల బ్రహ్మచారి కిషన్ మహరాజ్ ఆధ్వర్యంలో సేవాలాల్‌కు మహా భోగ్ బండారో సమర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సేవాలాల్ గోర్ జాతికి చేసిన సేవలను వివరించారు. గ్రామంలో సేవాలాల్ గుడి నిర్మాణం గురించి అడుగగా మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లి గుడి నిర్మాణానికి సహకరిస్తానని తెలిపారు. రాజ్‌కుమార్, రాహుల్, హరిలాల్, రవివర్మ, నందానాయక్, భీమా నాయక్, హేమాలాల్, సారయ్య, ప్రతాప్‌సింగ్, భద్రు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు

ములుగు రూరల్: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు జంగాపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి హర్షవర్ధన్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సామల శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో హర్షవర్ధన్‌ను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంటలార్పిన అటవీ శాఖ సిబ్బంది

వాజేడు: అడవిలో మంటలు రావడంతో అప్రమత్తమైన అటవీశాఖ సిబ్బంది మంటలను ఆర్పారు. మండలంలోని దూలాపురం రేంజ్‌లో ఉన్న కొంగాల గుట్టలపై సోమవారం రాత్రి మంటలు వచ్చినట్లు ఫైర్ పాయింట్స్ ఆధారంగా గుర్తించారు. దూలాపురం రేంజ్‌కి చెందిన సిబ్బంది లలిత, వాసు, ఫైర్‌వాచర్లు దాదాపు 3.5 కిలో మీటర్ల మేర కాలినడకన గుట్టపై ఉన్న కొంగాల తలగోడు మడుగు ఏరియాకు మంగళవారం ఉదయం వెళ్లారు. అక్కడ అడవిలో మంటలు కనిపించడంతో ఆర్పారు.


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291